మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 169 | కర్నూలు | ఆదివారం 02-08-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi




# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయ్

**హేళన చేసిన వారు అడ్రస్ లేకుండా పోయారు**
**కష్టాల్లో ఉన్న ఎపిని ఆదుకున్న ప్రధాని మోడీ**
**పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కును కాపాడిన ప్రధాని**
**ఉత్తరాంధ్ర దిశ మారబోతోందని చంద్రబాబు వెల్లడి**





విజయనగరం,ఆగస్ట్1(శ్రీచక్ర) భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కష్టాల్లో ఉన్న ఏపీకి ప్రధాని మోదీ ఆక్సిజన్ ఇచ్చారని కొనియాడారు. రాజధాని అమరావతికి నిధులు ఇచ్చి ప్రధాని అండగా నిలిచారని ఉద్ఘాటించారు. పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కును మోదీ కాపాడారని ప్రశంసించారు. ఎయిర్‌పోర్ట్‌కు భూములు ఇచ్చిన రైతులకు పాదాభివందనాలు చేస్తున్నానని పేర్కొన్నారు. ఏపీని పునర్‌నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. చేస్తున్నామని స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొని సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదని కొందరు హేళన చేశారని సీఎం విమర్శించారు. అవహేళన చేసినవారు అడ్రస్ లేకుండా పోయారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్రకు నాంది పలికామని ఉద్ఘాటించారు. గూగుల్, స్టీల్ కంపెనీలతోపాటు చాలా సంస్థలు వచ్చాయని వివరించారు. ఉత్తరాంధ్ర దశ, దిశ మారబోతున్నాయని వెల్లడించారు. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని చూశామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు పెట్టుబడులు రాబోతున్నాయని వివరించారు. ఉత్తరాంధ్రలో అన్నిరకాల వనరులు ఉన్నాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. ఇక్కడికే ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చేలా చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేశాన్ని మోదీ 12 ఏళ్లుగా సమర్థంగా నడిపిస్తున్నారని సీఎం కొనియాడారు. దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చే ఘనత మోదీదేనని ప్రశంసల వర్షం కురిపించారు.

# భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

**స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి కీలకమైన రోజు**
**నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయి**
**చంద్రబాబు విజన్‌తో ఎపి అభివృద్ధిలో పరుగెడుతోంది**
**12 ఏళ్లలో దేశంలో కొత్తగా 166 విమానాశ్రయాలు నిర్మించాం**
**విమానం ఎక్కాలన్న పేదల కల సాకారం చేస్తున్నాం**
**భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభించిన మోడీ**
**పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ శ్రీకారం**

విజయనగరం,ఆగస్ట్1(శ్రీచక్ర) స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి నేడు కీలకమైన రోజు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రూ.18 వేల కోట్లతో శనివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయని ఆయన చెప్పుకొచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. 'ఈ నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయన్నారు. కొత్త ప్రాజెక్టులు ఎయిర్, రోడ్ కనెక్టివిటీని పెంపొందిస్తాయి. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు చేస్తున్నా. 13 వేల మంది గిరిజన మహిళల నృత్యం అద్భుతంగా ఉంది. అభివృద్ధితోపాటు థింసా నృత్యంలోనూ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇది చంద్రబాబు విజన్‌కు మరో సాక్ష్యం' అని



పేర్కొన్నారు. విమానాశ్రయాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

# లోకేశ్‌కు ప్రధాని అభినందనలు

**బాగా పనిచేస్తున్నావంటూ కితాబు**



విజయనగరం,ఆగస్ట్1(శ్రీచక్ర) : భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ.. ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రధానికి వీడ్కోలు పలికేందుకు వచ్చిన లోకేశ్ భుజం తట్టి.. 'నువ్వు చాలా బాగా పనిచేస్తున్నావు.. శభాష్ లోకేశ్' అని ప్రశంసించారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ప్రారంభోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంపై కూడా ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారు. నారా లోకేశ్ పనితీరును ప్రధాని మోదీ మెచ్చుకోవడం ఇదేం తొలిసారి కాదు. గతంలో ఆంధప్రదేశ్‌లో ప్రధాని పాల్గొన్న పలు ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో లోకేశ్ కీలక పాత్ర పోషించిన సందర్భాల్లోనూ మోదీ ఇదే తరహాలో ఆయనను అభినందించారు. ముఖ్యంగా 'యోగాంధ్ర' కార్యక్రమం ద్వారా ప్రపంచ రికార్డు స్థాయిలో యోగా నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. తాజాగా భోగాపురం పర్యటన సందర్భంగా మరోసారి లోకేశ్‌ను ఆప్యాయంగా అభినందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# పాణం కోసం 5,839 మంది ఎదురుచూపు!

**బ్రెయిన్ డెడ్ దాతలే వేలాది మందికి ఆశాకిరణం**
**దేశం(2025)లో ఆరో స్థానానికి ఏపీ..**
**గత ఏడాది 93 మంది దాతలతో 301 అవయవ మార్పిడులు**
**ఈ ఏడాది ఇప్పటివరకు 56 మంది నుంచి అవయవాల సేకరణ**
**ఆగస్టు 3 అవయవదాన దినోత్సవం సందర్భంగా ప్రతి కుటుంబం చర్చించాలి**
**మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు**
**జీవన్ ధాన్ ఆధ్వర్యంలో వైజాగ్ లో ప్రత్యేక కార్యక్రమం**

అమరావతి, ఆగస్టు 1(శ్రీచక్ర) రాష్ట్రంలో అవయవ మార్పిడి కోసం వేలాది మంది ప్రాణాలతో పోరాడుతున్నారు. జీవన్‌దాన్ తాజా గణాంకాల ప్రకారం 2026 జూలై 1 నాటికి మొత్తం 5,839 మంది వివిధ అవయవాల కోసం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. వీరిలో అత్యధికంగా మూత్రపిండాలు, కాలేయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇలాంటి వారికి బ్రెయిన్ డెడ్ (మెదడు మరణం)చెందిన వ్యక్తుల కుటుంబాలు తీసుకునే అవయవదాన నిర్ణయమే కొత్త జీవితం ప్రసాదిస్తోంది. రాష్ట్రంలో బ్రెయిన్ డెడ్ దాతల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతుండటంతో అవయవ మార్పిడి సేవలు కూడా విస్తరిస్తున్నాయి. గత ఏడాది 93 మంది బ్రెయిన్ డెడ్ దాతల ద్వారా ఏకంగా 301 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగి జీవన్‌దాన్ చరిత్రలో కొత్త మైలురాయిగా నిలిచాయి. వైజాగ్ లో అవయవ దానంపై జీవన్ దాన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ పాల్గొననున్నారు రాష్ట్రంలో బ్రెయిన్ డెడ్ దాతల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2023లో 41 మంది దాతలు నమోదు కాగా, 2024లో 66 మందికి, 2025లో రికార్డు స్థాయిలో ×93 మందికి×చేరింది. ఈ ఏడాది జూలై 24 నాటికే 56 మంది దాతలు నమోదయ్యారు. ఈ పురోగతితో బ్రెయిన్ డెడ్ అవయవదానంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఆరో స్థానం సాధించింది. గతంలో కేవలం మూడు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకే ఇప్పుడు విజయవాడ, గుంటూరు, ప్రకాశం, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలకు విస్తరించాయి. ముఖ్యంగా విజయవాడ పరిధిలో బ్రెయిన్ డెడ్ దాతల నుంచి జరిగిన మూత్రపిండ మార్పిడులు 2024లో ఎనిమిది మాత్రమే ఉండగా, 2025లో 42కు పెరిగాయి.

# దేశాన్ని వికసిత్ భారత్‌గా నడిపిస్తున్న మోడీ

**భారత్ ప్రగతిపథంలో పయనించడానికి అహర్నిశలు శ్రమ**
**చంద్రబాబు మార్గదర్శకత్వంలో అగ్రగామిగా ఆంధ్రా**
**భోగాపురం సభలో పవన్ కళ్యాణ్**



విజయనగరం,ఆగస్ట్1(శ్రీచక్ర) 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సాకారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. భారత్‌ను ప్రగతి పథంలో వేగంగా నడిపిస్తున్న నేత ప్రధాని మోదీ అని తెలిపారు.

# ఎర్రబస్సు కాదు..ఎయిర్ బస్సులు వాలుతాయ్

**కళ్లు తెరచి చూస్తే అభివృద్ధి కనిపిస్తుంది**
**భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవంలో రామ్మోహన్**
**ఉత్తరాంధ్ర కలలకు రెక్కలిచ్చారన్న లోకేశ్**



విజయనగరం,ఆగస్ట్1(శ్రీచక్ర) ప్రపంచం మొత్తం ఇప్పుడు ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర విమాన యానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ... యువతకు ఉద్యోగావకాశాలు పెరగబోతున్నాయన్నారు. ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ సింహద్వారమని చెప్పుకొచ్చారు. ఏపీ అభివృద్ధికి కేంద్రంగా భోగాపురం మారనుందని తెలిపారు. ఎర్రబస్సు కూడా తిరగని ప్రాంతమని కొందరు హేళన చేశారని కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కళ్లు తెరిచి చూడండి.. ఎయిర్‌బస్సు తిరిగే ప్రాంతమైంది' అని తెలిపారు. ఉత్తరాంధ్రలో ప్రతి ఇంటి పండుగ ఇది అని అన్నారు. మన్యం వీరుడు అల్లూరి పేరు ప్రపంచం మొత్తం మార్మోగుతోందని తెలిపారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా ప్రధాని మోదీది అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కొనియాడారు. ప్రపంచం గర్వించదగ్గ నాయకుడు మోదీ. సీఎం చంద్రబాబు నాయకత్వంలో విజన్ 2047, ప్రధాని మోదీ సారథ్యంలో వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా పెట్టుకున్నాం అని రామ్మోహన్ నాయుడు వివరించారు. ఉత్తరాంధ్ర కలలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెక్కలిచ్చారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి నడిచిన ప్రాంతం.. ఉత్తరాంధ్ర. ఈ విమానాశ్రయం ఏపీకి పవర్ ఇంజిన్‌గా మారుతుంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకం కాబోతోంది. ఏపీ అభివృద్ధికి మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారు. నమో సహకారంతోనే రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సహజవనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతం ఉత్తరాంధ్ర. ఈ ప్రాంతం నుంచి వలసలు తగ్గుతాయి. ఎర్రబస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది..

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి సింహద్వారం.. భోగాపురం

**విమానాశ్రయ విశేషాలు ప్రధానికి వివరించిన రామ్మోహన్**
**విమానాశ్రయంలో కలియతిరుగుతూ వివరాలు వెల్లడి**

భోగాపురం, ఆగస్ట్ 01 : ఒకప్పుడు అవకాశాల కోసం ప్రపంచం వైపు ఉత్తరాంధ్ర చూసేదని.. ఇప్పుడు ప్రపంచం మనవైపు చూసేలా భోగాపురం విమానాశ్రయం చేసిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం నాడు ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తొలుత విమానాశ్రయానికి చేరుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి తో కలసి ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. విమానాశ్రయం పరిసరాలను, టెర్మినల్ భవనాన్ని చూపించి.. అందులోని విశేషాలను వివరించారు. అతిథుల ప్రసంగాల అనంతరం వేదిక పై నుండే భోగాపురంతో పాటు 18వేల కోట్ల నిధులతో వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన లను చేశారు. అనంతరం ప్రారంభోత్సవ వేదికపై అతిథులతో కలసి రామ్మోహన్ నాయుడు భాగస్వామ్యం అయ్యారు.

# సంపాదకీయం

## సీజేపీ సైలెంట్ ఉద్యమం

నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది.విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు.సీజేపీలో అశుతోష్ రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020?21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ, ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం.2021?22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టి సారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది.మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మందతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫోన్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి.కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిది కానీ, ద్వేషం, తిట్లు ద్వారా దష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి.తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటున్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను నమీకరించడంలో సహాయపడతాయిజంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి.రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది. ఈ ప్రయత్నాలు ఎంతవరకు విజయవంతం అవుతాయో, యాంటీ బీజేపీ ఫ్రంట్ ఎలా రూపుదిద్దుకుంటుందో రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది.

## ప్రధానమంత్రి కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం ద్వారా రూ30 లక్షల చెక్కుల పంపిణీ

**చెడు అలవాట్లకు లోను కాకుండా జీవితం కొనసాగించాలి**

**భావితరాలకు ఆదర్శవంతంగా ఉండాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**





కర్నూలు , ఆగస్టు 01 (శ్రీచక్ర): చెడు అలవాట్లకు లోను కాకుండా జీవితం కొనసాగించాలి, భావితరాలకు ఆదర్శవంతంగా ఉండాలి అని కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురికి రూ.30 లక్షల ఆర్థిక సహాయం అందజేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎ.సిరి వారిని ఉద్దేశించి పేర్కొన్నారు.శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో కోవిడ్-19 మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు వారి వయస్సు 23 సంవత్సరములు నిండిన తర్వాత ప్రధానమంత్రి కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం కింద వంశీ , ఇందుప్రియ ( కవలలు ) లకు రూ 20 లక్షలు , దినేష్ ఒక్కరికి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.30 లక్షల చెక్కులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా వారి తో ఆత్మీయంగా మాట్లాడిన జిల్లా కలెక్టర్ వారి విద్య , ఆరోగ్యం, భవిష్యత్తు కోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ ఆర్థిక సహాయం వారి ఉన్నత విద్యతో పాటు భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు లేనందువలన చెడు అలవాట్లకు లోను కాకూడదని మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకొని భావి తరాలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ వారిని ఉద్దేశించి అన్నారు. అనంతరం కలెక్టర్ కోవిడ్ మహమ్మారి వలన తల్లిదండ్రులను కోల్పోయి మాంటిసోరి స్కూలు లో చదువుతున్న సాహిత్య , రామ్ వర్ధన్ (అక్క , తమ్ముడు ) లతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. వారి భవిష్యత్తు ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. అమ్మా , నాన్న లేకపోవడం చాలా బాధాకరంగా ఉంటుందని కానీ ధృఢంగా ఎదగాలి , సంతోషంగా ఉండాలి అని వారికి తెలిపారు.ఇటీవల వివాహం చేసుకున్న ఇందుప్రియ ను జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేకంగా అభినందించి, పండ్లు శాలువాతో సత్కరించి , ఆమె దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. వంశీ తనకున్న పెన్సిల్ ఆర్ట్ తో గీసిన జిల్లా కలెక్టర్ చిత్రపటాన్ని కలెక్టర్ కు బహుకరించారు. ఈ సందర్భంగా రెండు సంవత్సరాల పిల్లలకు ఆహారంలో చక్కెర అదనంగా ఇవ్వరాదు అన్న పోస్టర్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ అధికారి విజయ మరియు జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద , ఐ సి డి ఎస్ అధికారులు , సిబ్బంది , చిన్నారులు మరియు వారి సంరక్షకులు పాల్గొన్నారు.

## "టెట్ "పరీక్ష ను కట్టుదిట్టంగా నిర్వహించాలి

**ఆగస్టు 5 నుండి 16 వరకు 11 రోజులు టెట్ పరీక్ష**

**ఆలస్యం గా వస్తే అనుమతించరు :జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**





కర్నూలు, ఆగస్టు 01 (శ్రీచక్ర): ఈ నెల 5వ తారీకున నుండి 16 వరకు " టెట్ " పరీక్షలను ప్రశాంత వాతావరణంలో ఎటువంటి లోపాలు లేకుండా కట్టు దిట్టంగా జరిపించాలని సమావేశంలో అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో టెట్ పరీక్ష ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల5వతారీఖు నుండి టెట్ పరీక్షను 11 రోజుల పాటు కట్టుదిట్టంగా,ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.పరీక్ష వ్రాసే విద్యార్థులకు పరీక్ష హాల్ లో మంచి వాతావరణం, పరిశుభ్రమైన గాలి , వెలుతురు తో ఉండా లని, శుభ్రమైన త్రాగునీరు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. టెట్ పరీక్ష 11 రోజుల పాటు రెండు విడతలుగా ఉదయం 9-30 నుండి 12-00 వరకు మరియు మధ్యాహ్నం 2-30నుండి 5 గంటల వరకు జరుగుతుందని , విద్యార్థులు అందరూ అటెండెన్స్ వేయించుకొని మరియు అన్ని తనిఖీలు చేయిం చుకుని నిర్దేశించిన సమయం ఉదయం 8-30 గంటల నుండి మరియు మధ్యాహ్నం 1-30 గంటల నుండి పరీక్ష హాలు లోకి చేరుకోవాలని ఆలస్యం గా వచ్చే వారిని అనుమతించరని , పరీక్ష హాలులోకి ఎవరు కూడా సెల్ ఫోన్లు , ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకొని రాకూడదని వాటిని బయటనే పెట్టి రావాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా గట్టిగా నిఘా ఉండాలని డీఈఓ ను ఆదేశించారు. ఈ పరీక్షల కు ప్రతి రోజు కరెంటు సరఫరా నిరంతరాయంగా కొనసాగాలని అందుకు కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు.ప్రతి సెంటర్ లో ఏ ఎన్ ఎం ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని అవసరం మేరకు అంబులెన్స్ లు అందుబాటులో ఉంచుకోవాలని , నడవలేని అన్యదా సమర్థులైన విద్యార్థులకు వీల్ చైర్స్ సౌకర్యం అవసరం మేరకు కల్పించాలని , సంబంధిత డాక్టర్ల ఫోన్ నెంబర్లు సూపరింటెండెంట్లకు తెలియజేయాలని డిప్యూటీ డి ఎం ఎం హెచ్ ఓ భాస్కర్ ను ఆదేశించారు. మొత్తం 31,773 మంది విద్యార్థులు కర్నూలుజిల్లాలో05కేంద్రాలలో మరియు హైదరాబాద్ లో 02 కేంద్రాలలో పరీక్ష రాస్తారని తెలిపారు. అవసరం మేరకు పరీక్షా కేంద్రాలు కర్నూలు మరియు ఆదోని లలో ఉదయం నుండి ఆర్టీసీ బస్టాండ్ నుండి " టెట్ పరీక్ష స్పెషల్ " బస్సు గా పేరు పెట్టి బస్సులు నడపాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ని ఆదేశించారు. ఈ సమావేశానికి డీఈవో సుధాకర్ , ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ లోకరాజు , డెప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ భాస్కర్ , రీజనల్ మేనేజర్ ఆర్టీసీ , శ్రీనివాసులు, స్పెషల్ బ్రాంచ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఖాజా హుస్సేన్ , ఎం ఈ ఓ లు ఫ్లయింగ్ స్క్వాడ్‌మెంబర్స్‌శ్రీధర్‌బాబురాజేంద్రప్రసాదరమాదేవి ,నజీర్‌భాషల ,సూపరింటెండెంట్ లు , పరీక్ష కోఆర్డినేటర్ లుపాల్గొన్నారు.

## నిరుపేద మహిళలకు దోమతెరలు, మస్కిటో కాయల్స్ పంపిణీ చేసిన డాక్టర్ శంకర్ శర్మ



కర్నూలు, ఆగస్టు 01 (శ్రీచక్ర): సమాజ సేవలో భాగంగా కర్నూలు నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న జై గురుదత్త పాలిక్లినిక్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ నిరుపేద వృద్ధ మహిళలకు దోమతెరలు, మస్కిటో కాయల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదరణ డే కేర్ సెంటర్‌లో నివసిస్తున్న సుమారు 50 మంది వృద్ధ మహిళలను ఉద్దేశించి డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమల బెడద అధికంగా ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్రమైన ప్రాంతాల్లో దోమలు వేగంగా వ్యాప్తి చెందుతాయని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. దోమల కాట్ల ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ దోమతెరలను తప్పనిసరిగా వినియోగించాలని, అవసరమైన చోట మస్కిటో కాయల్స్ లేదా ఇతర దోమ నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమలను నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యపరంగా తీవ్ర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు మరింత అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, శరీర నొప్పులు, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. అనంతరం ఆదరణ డే కేర్ సెంటర్‌లోని వృద్ధ మహిళలకు దోమతెరలు, మస్కిటో కాయల్స్ అందజేసి, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదరణ డే కేర్ సెంటర్ నిర్వహకులు రంజిత్, సిబ్బంది, స్థానికులు మరియు పలువురు సామాజిక సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధ మహిళలు డాక్టర్ శంకర్ శర్మకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయని అభినందించారు.

## జిల్లాలో బాల కార్మిక నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టండి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, ఆగస్టు 01 (శ్రీచక్ర): జిల్లాలో బాల కార్మిక నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లో బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో పాటు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో నియమించడం చట్టవిరుద్ధమని కలెక్టర్ స్పష్టం చేశారు. బాల కార్మిక నిర్మూలనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు మరింత ముమ్మరం చేయాలని, అవగాహన కార్యక్రమాలను ఇంకా విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో అక్షరాస్యత పెంపుతో పాటు బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరీ నిర్మూలనపై ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇళ్లలో, వాణిజ్య సంస్థల్లో, పరిశ్రమల్లో బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని ప్రజలకు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బాలకార్మికులు లేదా వెట్టి చాకిరీకి సంబంధించిన సమాచారం అందించేందుకు సంబంధిత శాఖల సంప్రదింపు నంబర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ వివరాలను సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో అనాథలు, పాక్షిక అనాథలు మరియు బాల కార్మికులుగా గుర్తించబడిన చిన్నారులను తక్షణమే ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు లేదా అనాథ శరణాలయాల్లో చేర్పించి వారికి విద్య, సంరక్షణ అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సమావేశంలో అదనపు ఎస్పి హుస్సేన్ పీరా, కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, లెప్రసీ అధికారి డా.భాస్కర్ రాజు, ఇలిఇ ఛైర్మన్ జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలకు స్కౌటింగ్ ఉద్యమం వేదిక :జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, ఆగస్టు 01 (శ్రీచక్ర): సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలకు స్కౌటింగ్ ఉద్యమం వేదిక అని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రపంచ స్కార్ఫ్ దినోత్సవం (వరల్డ్ స్కార్ఫ్ డే ) సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించే గొప్ప వేదిక అని కలెక్టర్ పేర్కొన్నారు. స్కౌటింగ్ ఉద్యమ విశిష్టత, విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల పెంపుదలపై కలెక్టర్ అవగాహన కల్పించారు. 1907లో లార్డ్ బాడెన్ పోవెల్ ఇంగ్లాండ్‌లోని బ్రౌన్‌సీ ఐలాండ్‌లో స్కౌటింగ్ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా వరల్డ్ స్కార్ఫ్ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవలో స్కౌట్స్, గైడ్స్ ఎల్లప్పుడూ ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నారని కలెక్టర్ కొనియాడారు.. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రదానం చేసే రాజ్య పురస్కార్ (గవర్నర్ అవార్డు) సర్టిఫికేట్ పొందిన విద్యార్థులకు ఎంసెట్ (ఇప్సెట్ )తో పాటు ఉన్నత విద్యా ప్రవేశాల్లో 0.5 శాతం రిజర్వేషన్ కల్పించబడుతుందన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డిఈఓ సుధాకర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## వైసీపీ నుండి టిడిపిలోకి భారీగా చేరికలు,

ఎమ్మిగనూరు,ఆగస్టు,1 (శ్రీ చక్ర) పట్టణంలోని 7, 8, 9 వార్డుల నుంచి దాదాపుగా 500 మంది వైసీపీ కార్యకర్తలు, కీలక నేతలు ఎమ్మెల్యే బి.వి.జయనాగేశ్వర్ రెడ్డి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైకాపాలో జరుగుతున్న అరాచకాలు, కుట్ర రాజకీయాలు, ప్రజావ్యతిరేక విధానాల పట్ల విసుగు చెంది వైసిపి నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పట్టణంలోని 7, 8, 9 వార్డులకు చెందిన దాదాపు 500 మంది వైసీపీ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు వైసీపీకి రాజీనామా చేసి, ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి సమక్షంలో పట్టణ సెక్రటరీ కదిరికోట అనిల్ కుమార్ మరియు వార్డు కమిటీ సభ్యుల సమక్షంలో టిడిపి పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులు, కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసమే ఈ భారీ చేరికలకు కారణమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న టిడిపి పార్టీ కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టిడిపి పార్టీలో చేరిన వారిలో టైటస్ ప్రతాప్, అఖిల్, శశవాలి,



సాగర్, ఎస్ విజయ్, ఎస్ ప్రవీణ్, శాలెం, ఆర్యన్, శాంతన్న, బి జయరాజు బీఎస్పీ నాయకులు, దీవెనమ్మ, వినయ్, జే చిన్న, బి మోషెన్న, జే సతీష్ తదితరులు మరియు ఎస్సీ, మైనారిటీ కుటుంబాలు s కదిరికోట అనిల్ కుమార్ మరియు వార్డు కమిటీ సభ్యుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, వార్డు నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం,






పెద్దకడబూరు, ఆగస్టు 1, (శ్రీ చక్ర ):-మండల కేంద్రమైన పెద్దకడబూరులోని బూత్ నెం. 204, ఎస్సీ కాలనీ లో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తూనే, ప్రతి గ్రామంలో తాగునీరు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడప గడపకు చేరవేయడమే లక్ష్యంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజల సమస్యలను నేరుగా నమోదు చేసి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.అంతకుముందు ఉదయం 6 గంటల నుండి అవ్వాతాతలకు సామాజిక భద్రతా పెన్షన్లను పంపిణీ చేసి అనంతరం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో గృహాలను సందర్శించి ప్రజలతో టిడిపి చేపట్టిన వలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ అధ్యక్షుడు డి.మల్లికార్జున, ఎం.నాగరాజు, కేజీ.మల్లికార్జున, బొగ్గుల తిక్కన్న, ఎం. రామన్న, డీలర్లు ఎం.ఆదాము, జి. ఆశన్న, ఇమ్మానియేల్, పెద్ద హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వం 3.0 పై న్యాయమూర్తు లకు అవగాహన కార్యక్రమము





కర్నూలు లీగల్, ఆగష్టు 1 (శ్రీ చక్ర ): కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మధ్యవర్తిత్వం 3.0 పై జిల్లా లోని న్యాయమూర్తులకు వగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్య వర్తిత్వ మరియు సయోధ్య ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసులను స్నేహ పూర్వకంగా పరిష్కరించడమే లక్ష్యంతో దేశములో మధ్యవర్తిత్వం 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించారని న్యాయమూర్తులకు వివరించారు. కోర్టుల్లో పెండింగ్ గల చెక్ బౌన్స్, మోటార్ ఆక్సిడెంట్, వివాహ సంబంధం, క్రిమినల్ కాంపౌండబుల్ మొదలగు కేసులను మీడియేషన్ కు పంపించాలని అన్నారు. అలాగే వారి కోర్టులలో న్యాయవాదులకు ఈ మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించాలన్నారు. సుప్రీం కోర్ట్ ఆదేశాల ప్రకారం హైకోర్ట్ జిల్లా కోర్టుల్లో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించాలని తీర్మానించిం దన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 1వ తేదీ నుండి డిసెంబర్ 31 వరకు దేశం కోసం మధ్యవర్తిత్వం 3.0 జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమములో కర్నూలు మరియు నంద్యాల జిల్లాల న్యాయ మూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం చట్టపరమైన చర్యలు తప్పవు: ఎస్ ఐ హరిప్రసాద్ బుచ్చినాయుడు

కండ్రిగ, ఆగస్టు 01 (శ్రీచక్ర):బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న కొంతమంది యువతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ హరిప్రసాద్ మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి చర్యల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని తెలిపారు. ఇకపై ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తూ పట్టుబడితే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మద్యం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని,బాధ్యతాయుతమైన పౌరులుగా సమాజంలో మెలగాలని సూచించారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు



# పుట్టిన మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలునే పట్టించాలి :ఐసిడిఎస్ అధికారి దేవకుమారి




సత్యవేడు, ఆగస్టు 01( శ్రీచక్ర):శిశువు పుట్టిన ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలునే పట్టించాలని తిరుపతి జిల్లా సత్యవేడు ఐసిడిఎస్ అధికారిణి దేవకుమారి సూచించారు.శనివారం నీలితొట్టి కండ్రిగ అంగనవాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి ఆధ్వర్యంలో ఆమె తల్లిపాలు వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవకుమారి తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ నవజాత శిశువులకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించడమే తల్లిపాలు వారోత్సవాల ఉద్దేశం అన్నారు.దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు ఒకటవ తేదీ నుంచి 7 వరకు ప్రతి అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలను జరుపుకుంటున్నామన్నారు. బిడ్డకు వారి తల్లులు మురుపాలు ఇవ్వడం వల్ల టీకా లాగా పనిచేసి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది అన్నారు. పైగా తల్లిపాలు శిశువుకు సంజీవిని లా వనిచేస్తుందన్నారు. దీంతోపాటు శారీరిక మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు.తదనంతరం తల్లిపాలు ప్రాధాన్యతను వివరిస్తూ అంగన్వాడి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇదే తరహాలో దలవాయి అగ్రహారం అంగనవాడి కేంద్రంలో టీచర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ కృష్ణవేణి, అంగన్వాడీ టీచర్ గౌరి,పలువురు తల్లులు పాల్గొన్నారు

# పల్లె బాటలో ఈగల్.. రచ్చబండ ద్వారా ప్రజలతో ముఖాముఖిబుచ్చినాయుడు

కండ్రిగ, ఆగస్టు 01 (శ్రీచక్ర) :తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని గ్రామాల్లో శనివారం ఈగల్ బృందం ఆధ్వర్యంలో “వల్లె బాటలో ఈగల్” కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రచ్చబండ ఏర్పాటు చేసి ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, గంజాయి, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం ఇన్స్పెక్టర్ జి. ప్రసాద్ మాట్లాడుతూ, గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని, వాటిని గ్రామాల్లోకి రానివ్వకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసు శాఖతో ప్రజలు కలిసి పనిచేస్తే మాదకద్రవ్యాల నిర్మూలన సులభమవుతుందని పేర్కొన్నారు.అనుమానాస్పద వ్యక్తులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. గ్రామాల్లో శాంతి భద్రతలు, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని వివరించారు.ఈ కార్యక్రమంలో ఈగల్ బృందం సిబ్బంది, స్థానిక పోలీసులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. ప్రజలు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చి అవగాహన కల్పించారు.

# యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో ఫ్రీ సీట్ సాధించిన దువ్వూరు. పార్థు రెడ్డి..,

**పార్థు రెడ్డికి అభినందనలు వెల్లువ..దువ్వూరు.పార్థు రెడ్డి టిడిపి యువ నాయకులు దువ్వూరు. జనార్ధన్ రెడ్డి తనయుడు కావడం విశేషం..,**

కోట : ఆగస్టు 1 (శ్రీ చక్ర): కోట మండలం విద్యానగర్ లో నివాసం ఉంటున్న టిడిపి యువ నాయకులు దువ్వూరు జనార్దన్ రెడ్డి తనయుడు దువ్వూరు పార్థు రెడ్డి యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో ఫ్రీ సీటు దక్కించుకున్నారు.ఈ సందర్భంగా ఢిల్లీలో యుపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న కొవ్వూరు పార్థు రెడ్డి ఫిలాసఫీ ఆప్షనల్ సబ్జెక్టులో నైపుణ్యం కోసం ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో మాస్టర్స్ డిగ్రీకి ఎంపిక కావడం జరిగింది. చెన్నైలో ఆర్ఎంకె కాలేజీలో పార్థు రెడ్డి ప్రతిభను గుర్తించి ఐఏఎస్ కు చెందిన పలు సబ్జెక్టుల్లో నైపుణ్యత డెవలప్ చేసుకోవాలని ఆర్ఎంకె యాజమాన్యం పలు సూచనలు సలహాలను అందజేశారు.అయితే దువ్వూరు జనార్దన్ రెడ్డి ఏకైక పుత్రుడు దువ్వూరు పార్థు రెడ్డి ఉన్నత చదువులకు విదేశీ యూనివర్సిటీకి ఎంపిక అయ్యారు.దువ్వూరు పార్థు రెడ్డి తండ్రి జనార్దన్ రెడ్డి దేశంలోనే




అత్యున్నత సర్వీసు అయిన ఐఏఎస్ కావాలన్నా సంకల్పముతో దేశ రాజధాని ఢిల్లీలో పట్టుదలతో, సంకల్పముతో శిక్షణ తీసుకుంటుండగా,ఎంపిక చేసుకున్న ఫిలాసఫీ సబ్జెక్టులో మరింత నైపుణ్యం సాధించినందుకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో మాస్టర్ డిగ్రీకి ఎంపికయ్యారు.ఈ యూనివర్సిటీలో ఉచిత సీట్ తో పాటు,పార్థు రెడ్డి స్కాలర్షిప్ కు ఎంపిక కావడం విశేషం.ఈ సందర్భంగా వారి అభిమాన, ప్రియతమ నాయకుడైన జనార్దన్ రెడ్డి సుపుత్రుడు విద్యారంగంలో రాణించడంతో ఆయన ప్రియ అనుచరులు ఢిల్లీ నుంచి వస్తున్న పార్థు రెడ్డి ని చెన్నై ఎయిర్ పోర్ట్ లో ఘన స్వాగతం పలికి అభినందనలతో సత్కరించారు.ప్రస్తుతం పలువురు దువ్వూరు.పార్థు రెడ్డి తండ్రి టిడిపి యువ నాయకులు దువ్వూరు జనార్దన్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్నారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో పార్థు రెడ్డి ఫ్రీ సీటు సాధించినందుకు గాను విద్యానగర్ నుండి కల్లూరు కొత్తపాలెంలో ఇటీవలన అధునాతనంగా కనివినీ ఎరగనీ రీతిలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు కుటుంబ సభ్యులతో పాదయాత్ర చేసి మొక్కుబడిని తీర్చుకోవడం జరిగింది.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

బి.ఎన్. కండ్రిగ, ఆగస్టు 01 (శ్రీచక్ర):బుచ్చినాయుడు కండ్రిగ మండలం బుచ్చినాయుడు కండ్రిగ గ్రామంలోని అరుంధతివాడలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు యం. సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం రూ. 4,000కు పెంచిన విషయాన్ని లబ్ధిదారులకు గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై. మునయ్యనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వై. సురేంద్రబాబు, యూనిట్ ఇన్‌చార్జి సునీల్, పంచాయతీ కార్యాలయు సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారుల రక్షణ ప్రతి తల్లిదండ్రి బాధ్యత

**పోక్సో, సైబర్ నేరాలు, గంజాయిపై విద్యార్థులకు అవగాహన**



సత్యవేడు, ఆగస్టు 1 (శ్రీచక్ర): సమాజంలో వేగంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో చిన్నారుల రక్షణను ప్రతి తల్లిదండ్రి అత్యంత బాధ్యతగా తీసుకోవాలని సత్యవేడు ఎస్సై సాయినాథ్ చౌదరి సూచించారు. శనివారం స్థానిక జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో సీఐ మురళినాయుడు ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోక్సో చట్టం, చిన్నారులపై లైంగిక వేధింపుల నివారణ, సైబర్ నేరాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయినాథ్ చౌదరి మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయం పిల్లలతో గడిపి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే నిర్లక్ష్యం చేయకుండా కారణాలు తెలుసుకుని మానసికంగా అండగా నిలవాలని తెలిపారు. కుటుంబంలో పిల్లలు నిర్భయంగా తమ సమస్యలను చెప్పుకునే వాతావరణం కల్పించడం అత్యంత అవసరమన్నారు. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2012లో పోక్సో చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వన్ మంత్ వన్ విలేజ్ లో ఫిర్యాదు తో కేశవరంలో

# తాగునీటి సమస్యకు పరిష్కారం



కోట : ఆగస్టు 1 (శ్రీ చక్ర):కోట మండలం కేశవరం పంచాయతీ ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం జరిగింది. వన్ మంత్ వన్ విలేజ్ లో గ్రామస్తులు తెలిపిన సందర్భంగా తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే సునీల్ కుమార్ సహాయ సహకారాలతో,కోట మండల తహసిల్దార్ జయ జయ రావు పర్యవేక్షణలో స్థానిక టీడీపీ నాయకుడు చాపల శ్రీనివాసులు ఆధ్వర్యంలో హై ప్రెజర్ లారీ బోరు సెట్ తో శనివారం బోరు సెట్ పనులు ప్రారంభించారు.కేశవరం పంచాయతీ ఎస్టీ కాలనీ ప్రజలు తాగునీటి సమస్యపై అర్జీ సమర్పించారు.ఈ అర్జీపై కోట మండల తహసిల్దార్,కేశవరం పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ కటారి జయ జయ రావు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అయితే ఈ బోరు సెట్ ఏర్పాటు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఉండే ప్రజలకు తాగునీటి సౌకర్యంగా ఉంటుందని తాహసిల్దార్ కటారి. జయ జయ రావు తెలిపారు. దీనితో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోట తాహసిల్దార్ కటారి.జయ జయ రావు,స్థానిక టిడిపి నాయకులు, చాపల.శ్రీనివాసులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ జయ జయ రావు,టీడీపీ నాయకులు చాపల శ్రీనివాసులు,చాపల విష్ణు,వి.కోటి.కె వెంకటేశ్వర్లు,సీ.హెచ్ ప్రభాకర్,ఎం.క్రిష్ణయ్య కోకొల్లు ముత్యాలయ్య,తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో ఫ్రీ సీట్ సాధించిన దువ్వూరు. పార్థు రెడ్డి..,

**పార్థు రెడ్డికి అభినందనలు వెల్లువ..ఐఏఎస్ పైనే తమకు అభిరుచి...,**

కోట : ఆగస్టు 1 (శ్రీ చక్ర): కోట మండలం విద్యానగర్ లో నివాసం ఉంటున్న టిడిపి యువ నాయకులు దువ్వూరు జనార్దన్ రెడ్డి తనయుడు దువ్వూరు పార్థు రెడ్డి యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో ఫ్రీ సీటు దక్కించుకున్నారు.ఈ సందర్భంగా ఢిల్లీలో యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న కొవ్వూరు పార్థు రెడ్డి ఫిలాసఫీ ఆప్షనల్ సబ్జెక్టులో నైపుణ్యం కోసం ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో మాస్టర్స్ డిగ్రీకి ఎంపిక కావడం జరిగింది. చెన్నైలో ఆర్ఎంకె కాలేజీలో పార్థు రెడ్డి ప్రతిభను గుర్తించి ఐఏఎస్ కు చెందిన పలు సబ్జెక్టుల్లో నైపుణ్యత డెవలప్ చేసుకోవాలని ఆర్ఎంకె యాజమాన్యం పలు సూచనలు సలహాలను అందజేశారు.అయితే దువ్వూరు జనార్దన్ రెడ్డి ఏకైక పుత్రుడు దువ్వూరు పార్థు రెడ్డి కావడం విశేషం.యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో మాస్టర్ డిగ్రీకి ఎంపికయ్యారు.ఈ యూనివర్సిటీలో ఉచిత సీట్ తో పాటు,పార్థు రెడ్డి స్కాలర్షిప్ కు ఎంపిక కావడం విశేషం. అంతేకాకుండా భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలనే ఉద్దేశంతో ఐఏఎస్ చదవాలనే అభిరుచి నా అంతర్గత లక్ష్యమని దువ్వూరు పార్థు రెడ్డి తెలిపారు.



# మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి వైసిపి శ్రేణులు శ్రీకారం

**రామచంద్రపురం పట్టణంలో గడపగడపకు కరపత్రాలు పంపిణీ**
**నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సూర్య ప్రకాష్,**
**మాజి రాజ్యసభ సభ్యుడు బోస్ పర్యటన**
**ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ శ్రేణులు**




రామచంద్రపురం, ఆగస్టు 1( శ్రీచక్ర)త్వరలో ప్రకటించబోయే పురపాలక సంఘ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పురపాలక సంఘ ఎన్నికల శంఖారావం కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిధిలోని పలువురు వైసీపీ శ్రేణులు తరలి వచ్చి రామచంద్రపురం పట్టణంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా "గడపగడపకు వైఎస్ఆర్" కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైన తీరు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అలాగే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ప్రజలతో ఆత్మీయ పలకరింపుతో మమేకమవుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని తెలియజేసి, రానున్న పురపాలక సంఘ ఎన్నికల్లో పార్టీని ఆశీర్వదించి విజయవంతం చేయాలని ఈసందర్భంగా ఆయా చోట్ల పర్యటనలో ప్రజలను కోరారు.దీంతో ఎన్నికల నగారా మోగక ముందే మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపి పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఆపార్టీ క్యాడర్ శనివారం నూతన ఉత్సాహంతో పురపాలక సంఘ పరిధిలో పలుచోట్ల ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

## కూటమి పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం

**ద్రాక్షారామంలో డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమంలో మంత్రి సుభాష్**





రామచంద్రపురం, ఆగస్టు 1 (శ్రీచక్ర)రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటింటి ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ వాసంశెట్టి సుభాష్ శనివారం ద్రాక్షారామంలోని 76, 78 బూత్‌ల పరిధిలో కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, గత రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అనేక రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ప్రజల గడప వద్దకే ప్రభుత్వం చేరుకుని వారి సమస్యలను తెలుసుకోవడం, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చూడడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమైన మంత్రి, వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రజలు వ్యక్తం చేసిన సమస్యలు, వినతులను స్వీకరించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు.ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించిన ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమం ద్రాక్షారామంలో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైసీపీ.ఇన్చార్జి.అన్నారాంబాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వెన్నా

మార్కాపురం: ఆగస్టు 1( శ్రీ చక్ర) మార్కాపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అన్నా రాంబాబు జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వెన్నా హనుమారెడ్డి అన్నా రాంబాబుని కలిసి పుష్పమాల వేసి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నా రాంబాబు ప్రజాసేవలో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వెన్నా హనుమారెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు పోరెడ్డి చెంచురెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఈ ఫైలింగ్ విధానంపై ఆన్లైన్ మోడ్లో శిక్షణ ప్రారంభించిన జిల్లా అదనపు జడ్జి లక్ష్మీకుమారి



రామచంద్రపురం, ఆగస్టు 1 (శ్రీ చక్ర)ఆంధ్ర ప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం న్యాయవాదులకు 13వ అదనపు జిల్లా కోర్టు హాలులో ఈ ఫైలింగ్ విధానంపై ఆన్లైన్ మోడ్ లో పి11-ఇసిటి-4- 2026 శిక్షణా కార్యక్రమాన్ని అదనపు జిల్లా జడ్జి బి హెచ్ వి లక్ష్మీ కుమారి ప్రారంభించారు. ఈసందర్భంగా 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు అడ్వకేట్ మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఆన్లైన్ మోడ్ కార్యక్రమాలు నిర్వహించారు. న్యాయవాదులు కేసులు ఫైలింగ్ విధానం ఈ ఫైలింగ్ ద్వారా మాత్రమే చేయాలని నూతన విధానాన్ని న్యాయవాదులకు వివరించారు. న్యాయవాదులతో పాటు న్యాయవాద గుమస్తాలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం వెంకటేశ్వరరావు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు, కార్యదర్శి నీలం మధుసూదనరావు, ఉపాధ్యక్షుడు బి.తారకేశ్వరరావు , మాజీ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ న్యాయవాదులు జుత్తుక నాగేశ్వరరావు దోమలపాటి సత్యనారాయణ ఎస్ బి ఎస్ కే కుమారస్వామి వనిత నరేంద్ర రెడ్డి కోటిపల్లి కిరణ్ కుమార్ శేష కుమార్ లోక్ అదాలత్ ప్యానెల్ మరియు మీడియేషన్ శిక్షణ పొందిన న్యాయవాదులు పి ఎల్ వీలు తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్



మార్కాపురం ఆగస్టు 1( శ్రీ చక్ర )మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత.?ముమ్మరంగా అప్రోచ్ రోడ్లు, తాగునీరు, విద్యుద్దీకరణ పనులు చేపట్టాలి. ?జాయింట్ కలెక్టర్, అధికారులతో కలిసి వేములకోట,దేవరాజుగట్టు తదితర కాలనీల్లో విస్తృత తనిఖీలు. వెలుగొండ ప్రాజెక్ట్ పునరావాస కాలనీల్లో ముంపు నిర్వాసితులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు.?శనివారం రోజున మార్కాపురం, పెద్దారవీడు మండలాల పరిధిలోని వెలుగొండ ప్రాజెక్ట్ పునరావాస కాలనీలైన దేవరాజుగట్టు, వేములకోట, తోకపల్లి, ఇడుపూర్ - 1, 2 లలో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల పురోగతిని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి మరియు వెలుగొండ ప్రాజెక్టు అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు.?ఈ సందర్భంగా కాలనీల లేఅవుట్లను, పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.?ప్రాధాన్యత ప్రాతిపదికన పనులు: పునరావాస కాలనీలకు వెళ్లే అప్రోచ్ రోడ్లు, తాగునీటి సరఫరా మరియు విద్యుత్ సౌకర్యాల ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలని స్పష్టం చేశారు.?జంగిల్ క్లియరెన్స్, లెవెలింగ్: ఇంకా జంగిల్ క్లియరెన్స్ పూర్తికాని కాలనీలలో తక్షణమే పొదలను తొలగించి, భూమిని సమాంతరంగా (లెవెలింగ్) మార్చే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.?నాణ్యతా ప్రమాణాలు: నిర్వాసితులకు కల్పిస్తున్న మౌలిక వసతులలో ఎలాంటి.లోపాలు.ఉండకూడదని, పనుల నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశిత సమయానికి అందుబాటులోకి.తీసుకురావాలని స్పష్టం చేశారు.?ఈ తనిఖీలో వెలుగొండ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నైతిక విలువలు సామాజి.క బాధ్యత.ఎస్ఐ పట్టణం




మార్కాపురం ఆగస్టు 1( శ్రీ చక్ర )మార్కాపురం మానవత శాఖ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణ మరియు సామాజిక బాధ్యతలపై విలువైన అవగాహన కల్పించినేన పట్టణ ఎస్.ఐ. విశ్వనాథ రెడ్డి. కి మానవతా సేవా సంస్థ కన్వీనర్ తడిక మల్ల శ్రీనివాసరావు మరియు ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి వారి చేతుల మీదుగా దుష్యాల్వాతో ఘనంగా సన్మానించడం జరిగింది అనంతరం ఈ కార్యక్రమంలో.విజయవంతం కావడానికి సహకరించిన హెడ్‌మాస్టర్ శ్రీ మునగాల చంద్రశేఖర్ రెడ్డి కి, నారాయణ నీ లావణ్య నీ మేడం కి ప్రత్యేక కృతజ్ఞతలు. ధన్యవాదాలు తెలిపారు ..మానవతా. స్వచ్ఛంద సేవా సంస్థ, మార్కాపురం శాఖ.అధ్యక్షులు: గుంటక సుబ్బారెడ్డి .కార్యదర్శి: అన్నా రాము .కోశాధికారి: తడికమళ్ళ శ్రీనివాసరావు .అనుముల రామాంజనేయులు బచ్చు సుబ్రహ్మణ్యం .పాలెం చెంచయ్య ఆమంచి చంద్రశేఖర్. డిపి రామిరెడ్డి .గోగిరెడ్డి..వెంకటనారాయణ రెడ్డి. గోళ్ల అపర్ణ.. గంగిశెట్టి కిరణ్.కందగట్ల కేశవరావు .టీవీ.బ్రహ్మం .నారాయణ.వెంకటేష్. కలవలపల్లిశ్రీనివాసులు మరియు కమిటీ సభ్యులు హై స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు

## ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్‌ను పంపిణీ చేసిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నారాయణవనంఆగస్టు1( శ్రీ చక్ర)తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, నారాయణవనం మండలం, కళ్యాణపురం పంచాయతీ పరిధిలోని పద్మావతి నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల అందిస్తున్న ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ను శనివారం ఉదయం సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వృద్ధాప్య, వితంతు, వికలాంగులు తదితర నిరుపేద లబ్ధిదారులకు ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ నగదు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.సంక్షేమ పాలనకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ప్రజలు రుణపడి ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, పంచాయతీ కార్యదర్శి మునిశేఖర్, కూటమి నాయకులు ఇలంగోవ రెడ్డి, ఎస్.ఎం.సురేష్, ఊరప్ప, శంకరయ్య, బాబు, చంద్రశేఖర్, బి.ఎం. నరేష్, అచ్చుకట్ల హరి, రామమూర్తి, దేవరాజులు, సుబ్రహ్మణ్యం, సోమశేఖర్, సొరకాయలు మొదలియార్, మోహన్ మొదలియార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## వరద పరిస్థితిపై24 గంటలు కంట్రోల్ ఏర్పాటు

**రామచంద్రపురం ఆర్డీవో సరళవతి**



రామచంద్రపురం, ఆగస్టు 1 (శ్రీచక్ర)ప్రస్తుత వరద ప్రభావం నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో 24 గంటలు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన్నట్లు రామచంద్రపురం ఆర్డీవో ఏ.సరళవతి ఒక ప్రకటనలో పేర్కొన్నారుప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు మరియు గోదావరి వరదల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో ఆగస్టు 1 నుండి ఆగస్టు 4 వ తేది వరకు ప్రత్యేక 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ. సరళవతి తెలిపారు.కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తూ అత్యవసర సమాచారం స్వీకరించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపడతారని ఈసందర్భంగా పేర్కొన్నారు.ప్రజలు వర్షాలు, వరదలకు సంబంధించిన అత్యవసర సమాచారం, సహాయం కోసం కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 08857-245166 ను 24 గంటల పాటు సంప్రదించాలని ఆర్డీవో కోరారు. అలాగే ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికార యంత్రాంగం సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## రామచంద్రపురం పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

రామచంద్రపురం, ఆగస్టు 1 (శ్రీచక్ర) రామచంద్రపురం పట్టణంలో 15, 16 వార్డుల్లో మంత్రి వాశంశెట్టి సుభాష్ తండ్రి సత్యం కూటమి పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించి, వారి ఆరోగ్య పరిస్థితి, కుటుంబ అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీనే ఉదయం నుంచే లబ్ధిదారుల గడప వద్దకు వెళ్లి పెన్షన్లు అందించడం దేశానికే ఆదర్శంగా నిలిచే సంక్షేమ కార్యక్రమమని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజా సంక్షేమాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా కూటమి ప్రభుత్వం పింఛను దారులకు ఏర్పాట్లు చేస్తోందని అన్నారు గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శక పాలన, వేగవంతమైన అభివృద్ధి, సమర్థవంతమైన సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో కొత్త నమ్మకాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివ, పట్టణ జనసేన అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, క్లస్టర్?2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు, కడియాల రాఘవన్, దిగుమర్తి వీరబాబు, చప్పిడి సతీష్, పెమ్మానబోయిన మణికంఠ, పసుపులేటి సత్తిబాబు, బన్ను, కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.




# రోజూ కొన్ని ఉడికించిన వేరుశెనగలు తినండి చాలు..



వేరుశెనగలు మన రోజువారీ ఆహారంలో ఓ భాగం. ఏదో ఓ రకంగా దాన్ని వంటల్లో వాడుతుంటాం. వేరుశెనగ పొడి లేదా చట్నీ లేనిదే అల్పాహారాన్ని ఊహించలేం కూడా. ఇడ్లీలు, దోసెలు వంటి టిఫిన్ ఐటమ్స్ లల్లో ఇవి తప్పనిసరి. అలాగే- అనేక రకాల కూరల వంటకాల్లో వేరుశెనగ పొడిని వాడుతుంటాం. అవి వాడటం వల్ల కూరల టేస్ట్ ఒక్కసారిగా పెరుగుతుంది. పైగా గ్రౌండ్ నట్స్ రుచికి రుచి, హెల్త్ కు హెల్త్ కూడా. వేరుశెనగలను ఉడికించి తినడం రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఉడికించిన వేరుశెనగలు అవసరమైన విటమిన్లు, ఖనిజాలకు నిలయం. పోషకాలు సమృద్ధిగా ఉండే ఈ గింజలు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఉడికించిన వేరుశెనగలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇప్పుడు చూద్దాం. ఉడికించిన వేరుశెనగల్లో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, వివిధ విటమిన్లు, ఖనిజాలు వంటి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు సంపూర్ణ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు కీలక పాత్ర పోషిస్తాయి. వేరుశెనగలో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికం. ఈ ఆరోగ్యకరమైన కొవ్వులను మితంగా తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గి, గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. వేరుశెనగల్లో రెస్వెరాట్రాల్ వంటి యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను నిరోధించి, ఆక్సీకరణ ఒత్తిడిని, శరీర మంటను తగ్గించడంలో సహాయపడతాయి. వేరుశెనగల్లో క్యాలరీలు అధికంగా ఉన్నప్పటికీ, వాటిలోని ప్రొటీన్, ఫైబర్ ఆకలిని నియంత్రించి, సంతృప్తినిస్తాయి. సమతుల్య ఆహారంలో చేర్చుకోవడం ద్వారా కడుపు నిండిన భావన కలిగి బరువు నియంత్రణకు తోడ్పడతాయి. వేరుశెనగల్లోని పీచుపదార్థం షుగర్ కంటెంట్ ను నెమ్మదింపజేసి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో తోడ్పడుతుంది. ఇది మధుమేహం ఉన్నవారికి లేదా ప్రమాదంలో ఉన్నవారికి ప్రయోజనకరం. మెదడు ఆరోగ్యానికి అవసరమైన ఫోలేట్, నియాసిన్ వంటి పోషకాలు వేరుశెనగల్లో అధికంగా ఉంటాయి. ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థకూ ఇవి ఎంతగానో మేలు చేస్తాయి. ఉడికించిన వేరుశెనగలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నప్పటికీ, క్యాలరీలు అధికంగా ఉంటాయి కాబట్టి మితంగా తీసుకోవడం ముఖ్యం. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని తమ రోజువారీ ఆహారంలో చేర్చుకునే ముందు వైద్య సలహా తీసుకోవాలి. ఉడికించిన వేరుశెనగలలోని డైటరీ ఫైబర్ క్రమబద్ధమైన ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. దీనికి ప్రీబయోటిక్ లక్షణాలు కూడా ఉంటాయి. మంచి జీర్ణక్రియను కోరుకునే వారికి ఇది ఒక గొప్ప ఎంపిక.

# రెస్టారెంట్ స్టైల్? క్రిస్పీ ఆలూ ఫ్రై.. ఇలా చేస్తే టేస్ట్ నెక్స్ట్ లెవెల్..!



ఆలూను ఫ్రై చేసుకున్నా.. టమాటాతో చేసినా.. కుర్మా చేసినా టేస్టీగానే ఉంటుంది. ఆలూ కర్రీ అన్నంతోపాటు చపాతీల్లోనూ అద్భుతంగా ఉంటుంది. అయితే రెస్టారెంట్ స్టైల్ లో క్రిస్పీగా ఆలూ ఫ్రైను ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? ఆలూ ఫ్రై చేయడానికి గల పదార్థాలు చూస్తే.. బంగాళా దుంపలు మూడు, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్టు తగినంత, కారం టీ స్పూన్, మిరియాల పొడి, గరం మసాలా పొడి, ఉప్పు సరిపడా, నూనె తగినంత, నిమ్మరసం తగినంత, కరివేపాకు తీసుకోవాలి. క్రిస్పీ ఆలూ ఫ్రై ఎలా తయారు చేయాలంటే.. ముందుగా బంగాళ దుంపలను మీడియం సైజులో కట్ చేసుకుని ఓ గిన్నెలోకి తీసుకుని ఉప్పు వేసి ఉడికించుకోవాలి. ఆలూ ముక్కలు మరీ మెత్తగా కాకుండా సగానికిపైగా ఉడికే విధంగా చూసుకోవాలి. వాటిని ఓ బౌల్ లోకి తీసుకోవాలి. అందులోనే కారం, ధనియాల పొడి, మసాలా పొడి, మిరియాల పొడి వేసుకోవాలి. అలాగే రుచికి సరిపడా ఉప్పు, అల్లం పేస్టు యాడ్ చేసుకోవాలి. అందులోనే నిమ్మరసం కొద్దిగా వేసుకుని అరగంటపాటు మేరినేట్ చేసుకోవాలి. ' ఆ మిశ్రమంలోనే కోటింగ్ కోసం కొద్దిగా బియ్యం పిండి, అలాగే కార్న్ ఫ్లోర్ ను కలుపుకోవాలి. అందులోనే రెండు స్పూన్ ల మైదా లేదా శనగ పిండిని వేసుకోవాలి. అలా ఆ మిశ్రమాన్ని కొద్దిసేపు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసుకుని గిన్నె పెట్టుకుని దాంటో తగినంత నూనె వేసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత అందులో మ్యారినేట్ చేసుకున్న ఆలూ ముక్కలను ఒక్కొక్కటిగా వేసి ఫ్రై చేసుకోవాలి. అలా ఫ్రై చేసుకొనేటప్పుడు అందులోనే నాలుగైదు పచ్చిమిర్చి ముక్కలు, కొంచెం కరివేపాకు వేసి ఫ్రై చేయాలి. అంతే వాటిని ఓ బౌల్ లోకి తీసుకుని దానిపై కొంచెం చాట్ మసాలా వేస్తే సరి.. సూపర్ టేస్టీగా ఉండే క్రిస్పీ ఆలూ ఫ్రై రెడీ అయినట్లే..

# ఉసిరికాయ నిల్వ పచ్చడి.. ఇలా చేసి తింటే వింటర్ లో ఇమ్యూనిటీ బూస్ట్!

చలికాలంలో మనకు ఉసిరికాయలు చాలా ఎక్కువ దొరుకుతాయి. ఈ సీజన్లో దొరికే ఉసిరికాయలతో పచ్చడి పెట్టుకుని ఆ పచ్చడిని తింటే ఈ సీజన్లో వచ్చే అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చు. అయితే ఉసిరికాయ నిలవ పచ్చడిని ఏ విధంగా పెట్టుకోవాలి. ఎలా పెట్టుకుంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. రుచికరంగా ఉంటుంది అనేది ప్రస్తుతం తెలుసుకుందాం. ఉసిరికాయ నిలువ పచ్చడి పెట్టుకోవడానికి కావలసిన పదార్థాలు ఉసిరికాయలు- ఒక కేజీ పల్లీ నూనె లేదా ఆవనూనె- 250 మిల్లీగ్రాములు మెంతి, జీలకర్ర, ఆవ పొడి- రెండు టేబుల్ స్పూన్లు కారం- 150 గ్రాములు ఉప్పు- 150 గ్రాములు వెల్లుల్లి రెబ్బలు- 15 ఆవాలు, జీలకర్ర- ఒక స్పూన్ ఉసిరికాయ పచ్చడి తయారీ విధానం ఉసిరికాయ పచ్చడి తయారు చేసుకోవడానికి ముందుగా ఉసిరికాయలను శుభ్రంగా కడుక్కొని తుడిచి ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి అందులో నూనె పోసి ఆ నూనెలో ఉసిరికాయలను వేసి నిదానంగా మగ్గేలా వేపుకోవాలి. వీటిని పక్కన పెట్టుకొని, మరొక పాన్లో రెండు స్పూన్ల మెంతులు, రెండు స్పూన్ల జీలకర్ర, రెండు స్పూన్ల ఆవాలు వేసుకుని వాటిని కూడా చిన్న సెగ మీద వేయించుకోవాలి.ఆ తర్వాత స్టవ్ వెలిగించి బాణలిలో ఉన్న నూనెలో మళ్లీ కొద్దిగా ఆవాలు, జీలకర్ర, కచ్చాపచ్చాగా దంచుకున్న వెల్లుల్లిని వేసి అందులో పొడి చేసుకున్న జీలకర్ర, మెంతులు, ఆవల పొడిని వేసుకుని, అందులోనే పేర్కొన్న కొలతల మేరకు కారాన్ని, ఉప్పును యాడ్ చేయాలి. బాగా



కలుపుకోవాలి. ఆపై స్టవ్ ఆఫ్ చేసి ఉసిరికాయ ముక్కలను కూడా అందులో కలుపుకోవాలి. నిమ్మకాయ రసంతో ఉసిరికాయ పచ్చడికి కొత్త రుచి పచ్చడి పులుపు దనం కోసం, నిల్వ ఉండడం కోసం మూడు పెద్ద నిమ్మకాయల రసాన్ని అందులో వేస్తే ఉసిరికాయ పచ్చడి రెడీ అవుతుంది. ఈ పచ్చడి ఫ్రిజ్లో నిల్వ చేసుకుంటే ఎన్ని రోజులైనా రంగు మారకుండా పాడవకుండా ఉంటుంది. ఈ సీజన్లో ఉసిరికాయ పచ్చడి తినడం వల్ల ఇమ్యూనిటీ పెరిగి ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# ప్రతీ రోజు ఇవి రెండు నోట్లో వేసుకోండి- షుగరు, బీపీ పరార్..!!

వంటకాలకు ప్రత్యేకమైన సుగంధాన్ని ఇచ్చే యాలకులు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. సుగంధ ద్రవ్యాల రాణిగా యాలకులను పిలుస్తారు గొప్ప సువాసన, రుచికి ప్రసిద్ధి చెందిన యాలకులను తీపి వంటకాల్లోనే కాదు అన్ని రకాల వంటకాలకు వాడతారు. సువాసన గల మసాలా దినుసుగా కూడా యాలకులకు పేరుంది. యాలకులకు మూలికా లక్షణాలను, ఔషధ గుణాలను అందిస్తాయి. యాలకుల పొడి షుగరుతో పాటుగా హైబీపీని నియంత్రించే లక్షణాలు కలిగి ఉంటుంది. అజీర్ణ సమస్యల కు పరిష్కారంగా నిపుణులు చెబుతున్నారు. యాలకులలోని ముఖ్యమైన నూనె మెంథాన్ అసిడిటీ, అపానవాయువు వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇది మంచి జీర్ణక్రియను అందిస్తుంది. అలాగే కడుపులో మంటగా ఉండటాన్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం,



కాల్షియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అంది స్తాయి. తాజా శ్వాసకు యాలకుల గింజలు నమలడం మంచిది. నోటి ఆరోగ్యాన్నిపెంచుతుంది. యాలకులలో ఉండే ఫైబర్ మీ జీర్ణవ్యవస్థకు కూడా మేలు చేస్తుంది. ఇది ఆహారం సరిగ్గా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. కడుపు సమస్యలను నివారిస్తుంది. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, యాలకులు తినడం వల్ల మీకు ఉపశమనం లభిస్తుంది. యాలకులలో పొటాషియం లభిస్తుంది. అటువంటి పరిస్థితిలో, యాలకుల నీరు తీసుకోవడం వల్ల మీ రక్తపోటు నియంత్రణలో సహాయపడుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను పెంచదు. గుండె సంబంధిత అన్ని వ్యాధుల నుండి మిమ్మల్ని సురక్షితంగా ఉంచుతుంది. డిన్నర్ కాస్త హెవీగా చేసినప్పుడు కూడా యాలకులు తినడం చాలా మంచిది. పొట్టలోని కండరాలను ఇవి రిలాక్స్ చేయడంతో పాటు గ్యాస్ ఫామ్ అవ్వకుండా చూస్తాయి. రెగ్యులర్ గా వీటిని తీసుకోవడం వల్ల సరైన విధంగా శరీరానికి పోషకాలు అందుతాయి. ఆరోగ్యాన్ని అందించే గట్ మైక్రోబయోమ్ ని పెంచుతాయి. పొట్టలో ఎలాంటి సమస్య లేకుండా హాయిగా నిద్ర పడుతుంది. రాత్రి పూట యాలకులు తినడం వల్ల స్ట్రెస్ లెవెల్స్ కూడా తగ్గిపోతాయి. ముఖ్యంగా హార్ట్ రేట్ కంట్రోల్ లో ఉంటుంది. బాడీని పూర్తిగా రీసెట్ చేయడంలో తోడ్పడతాయి.

# "కాకరకాయ పచ్చడి" ఇలా చేస్తే ఎవరైనా తినాల్సిందే..!

కాకరకాయ అంటే చాలామందికి ఎక్కువగా ఇష్టం ఉండదు. అలాంటి వారి కోసమే నచ్చేలా చేయాలి అనుకునే వారికి కాకరకాయ పచ్చడి మంచి ఆప్షన్. సరైన పద్ధతిలో చేస్తే ఇది అద్భుతమైన రుచి, మీాల్‌కీ రెండింతలు పులుపు-కారం-రుచుల జోడింపు అనిపిస్తుంది. ముఖ్యంగా ఈ నిల్వ పచ్చడి (స్టోర్ పికిల్) నెలల తరబడి పాడవకుండా ఉంటుంది. వేడి అన్నం, పరాటా, దోసె, ఇడ్లితో కూడా మిక్స్ చేస్తే రుచిలో మునిగిపోతారు. కాకరకాయ పచ్చడిలో చేదు తగ్గించే టిప్స్.. కాకరకాయలోని చేదు రుచి తగ్గించే కొన్ని ముఖ్యమైన పద్ధతులు ఉన్నాయి. వీటిని పాటిస్తే మీా పచ్చడి చేదు లేకుండా, సంపూర్ణంగా రుచికరంగా ఉంటుంది. కాకరకాయ ముక్కలపై ఉప్పు రాసి 20-30 నిమిషాలు ఉంచితే, చేదు నీరు బయటకు వస్తుంది. తర్వాత ఆ నీటిని పూర్తిగా పిండి పారేయాలి. ఉప్పు రాసిన తర్వాత గాలికి లేదా సూర్యానికి 30 నిమిషాల-1 గంట వరకు ఆరబెట్టితే, చేదు పూర్తిగా తగ్గి, పచ్చడి ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. అలానే కాకరకాయ ముక్కలను హై ఫ్లేమ్‌లో వేయిస్తే చేదు రుచి లేకుండా కరకరలాడే టెక్స్చర్ వస్తుంది. ఈ రుచికరమైన కాకరకాయ పచ్చడి తయారీని విధానం మీాకోసం ప్రత్యేకంగా.. ఇలా చేస్తే ఒక్క ముద్ద కూడా అన్నం వదలరు" కాకరకాయ పచ్చడికి కావలసిన పదార్థాలు.. కాకరకాయలు - అర కిలో చింతపండు - 80 గ్రాములు బెల్లం - 1 టీ స్పూన్ మెంతులు -½ టీ స్పూన్ ఆవాలు - 1 టేబుల్ స్పూన్ జీలకర్ర - 1 టీ స్పూన్ నువ్వుల



నూనె - 2 కప్పులు దంచిన వెల్లుల్లి - 30 రెబ్బలు ఆవాలు - 1 టీ స్పూన్ జీలకర్ర - 1 టీ స్పూన్ ఇంగువ -½ టీ స్పూన్ ఎండు మిరపకాయలు - 3 కరివేపాకు - కొద్దిగా ఉప్పు - అర కప్పు కారం - 1 కప్పు పసుపు - 1 టీ స్పూన్ తయారీ విధానం.. కాకరకాయలను శుభ్రంగా కడిగి నీరు ఆరనివ్వాలి. చివరలు తీసి లావుగా ముక్కలు కోయాలి. తర్వాత ఉప్పు రాసి 20-30 నిమిషాలు ఉంచాలి. చింతపండును నీళ్లలో వేసి స్టవ్‌పై ఉడికించాలి. మెత్తగా అయ్యాక బెల్లం జోడించి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి. తర్వాత మిక్సీలో వేసి సాఫ్ట్ పేస్ట్‌లా గ్రైండ్ చేయాలి. ఇక పాన్‌లో మెంతులు స్వల్పంగా రంగు మారేవరకు వేయించాలి. ఆవాలు, జీలకర్ర వేసి నిమిషం పాటు వేయించాలి. చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి. ఇప్పుడు కడాయిలో నువ్వుల నూనె వేడి చేయాలి. నూనె బాగా వేడి అయితేనే కాకరకాయ వేయాలి. హై ఫ్లేమ్‌లో స్వల్పంగా బ్రౌన్ అయ్యే వరకు వేయించాలి. వేయించిన ముక్కలను పక్కన పెట్టాలి. అదే నూనెలో దంచిన వెల్లుల్లి (10 రెబ్బలు) వేయాలి. ఆవాలు, జీలకర్ర, ఇంగువ, ఎండు మిరపకాయలు, కరివేపాకు వేసి దోరగా వేయాలి. చివరగా చింతపండు గుజ్జు వేసి 2-3 నిమిషాలు వేయించి చల్లారనివ్వాలి. అనంతరం ఒక పెద్ద గిన్నెలో మెంతి పొడి, కారం, ఉప్పు, పసుపు వేసి కలపాలి. వేయించిన కాకరకాయ ముక్కలను అందులో వేసి కలియబెట్టాలి. మిగిలిన వెల్లుల్లి రెబ్బలు వేస్తే రుచి రెండు రెట్లు పెరుగుతుంది. చల్లారిన తాళింపును జోడించి పచ్చడిని బాగా కలపాలి. ఇప్పుడు మీాకు పచ్చడి సిద్ధంగా ఉంటుంది. ఎంతకాలం నిల్వ ఉంటుంది? ఈ కాకరకాయ పచ్చడి తయారైన రోజు నుంచే తినవచ్చు, కానీ రెండు రోజుల తర్వాత అసలు రుచి బయటపడుతుంది. గాలి రాని కంటైనర్‌లో ఉంచితే 3-4 నెలలు పాడవకుండా ఉంటుంది. తప్పనిసరిగా నువ్వుల నూనెనే వాడాలి. వేయించేటప్పుడు హై ఫ్లేమ్ వాడితే కాకరకాయ చిరిగిపోదు. చింతపండు గుజ్జు పూర్తిగా చల్లారిన తర్వాతే కలపాలి. పచ్చడిని ఫ్రిజ్‌లో పెడితే 6 నెలలు వరకు నిల్వ ఉంటుంది.

# గోంగూర దోసకాయ పచ్చడి ఎప్పుడైనా ట్రై చేశారా..?

సాధారణంగా మనం గోంగూరతో పచ్చడి, మాంసం కూరలు ఎక్కువగా చేస్తుంటాం. కానీ దోసకాయను కలిపి తయారుచేసే ఈ వెరైటీ పచ్చడి మాత్రం చాలా మందికి కొత్తే. పుల్లగా, కాస్త ఘాటుగా, కమ్మగా ఉండే ఈ పచ్చడి పెద్దలకే కాదు పిల్లలకు కూడా బాగా నచ్చుతుంది. ముఖ్యంగా భోజనంలో కాస్త స్పెషల్‌గా ఏదైనా కావాలనిపించినప్పుడు ఇది బెస్ట్ ఆప్షన్. కొన్ని వంటకాలు ఒక్కసారి రుచి చూసిన వెంటనే మన ఇంటి రెగ్యులర్ మెనూలో చోటు సంపాదించుకుంటాయి. అలాంటి ప్రత్యేకత కలిగిన పచ్చడే ఈ గోంగూర దోసకాయ పచ్చడి. వేడి వేడి అన్నంతో కలిపి తింటే నోరూరించే రుచి, చపాతీ, రోటీలతో కలిపితే మరో స్థాయి అనుభూతి ఇస్తుంది. గోంగూర పుల్లదనం, దోసకాయ తాజాదనం కలిసి ఈ పచ్చడికి ప్రత్యేకమైన టేస్ట్‌ను అందిస్తాయి. ఈ నోరూరించే గోంగూర దోసకాయ పచ్చడి తయారీ విధానం మీాకోసం ప్రత్యేకంగా.. కావలసిన పదార్థాలు.. గోంగూర ఆకులు - ఒక పెద్ద కప్పు దోసకాయ - ఒకటి (చిన్న సైజు) ఉల్లిపాయ - ఒకటి పచ్చిమిర్చి - ఆరు చింతపండు - కొద్దిగా ఎండుమిర్చి - ఎనిమిది ఉప్పు - రుచికి సరిపడా నూనె - నాలుగు టేబుల్?స్పూన్లు వెల్లుల్లి రెబ్బలు - ఐదు ఆవాలు - అర చెంచా జీలకర్ర - అర చెంచా మెంతులు - అర స్పూన్ ఇంగువ - చిటికెడు తయారీ విధానం.. ఈ ప్రత్యేకమైన గోంగూర దోసకాయ పచ్చడిని



తయారుచేయడానికి, ముందుగా ఒక పెద్ద కప్పు గోంగూర ఆకులను కాడల నుండి తుంపి, వాటిని శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత చిన్న సైజు దోసకాయకు పీలర్ లేదా చాకుతో తొక్క తీసి చిన్న ముక్కలుగా కోసుకోవాలి. అలాగే, ఉల్లిపాయను సన్నగా తరిగి సిద్ధం చేసుకోవాలి.




# కామన్వెల్త్ గేమ్స్ 2026 విజేతలను ప్రశంసించిన ప్రధాని మోదీ




కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ అథ్లెటిక్స్ దూసుకెళ్తున్నారు. ఇప్పటి వరకు ఐదు స్వర్ణాలు, 12 రజతాలు, 6 కాంస్యాలతో మొత్తం 23 పతకాలు భారత్ ఖాతాలో ఉన్నాయి. ఇక కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు పతకాలు అందించిన అథ్లెట్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. జావెలిన్ త్రోలో రజతం గెలిచిన నీరజ్ చోప్రా, కాంస్య పతక విజేత యశ్వీర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.'గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్‌లో నీరజ్ చోప్రా అద్భుతం చేసి.. రజత పతకం అందుకున్నాడు. మెడల్ సాధించే క్రమంలో నిలకడ, సంయమనం, స్ఫూర్తిని ప్రదర్శించాడు. ఇదే ఆత్మవిశ్వాసంతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. యశ్వీర్‌కు శుభాకాంక్షలు. అద్భుతంగా త్రో చేసి.. పతకం సాధించావు. ఆటపై నీకున్న ఆసక్తి, నిబద్ధతకు ఇదే నిదర్శనం. ఈ విజయంతో యువ అథ్లెట్లకు స్ఫూర్తిగా నిలిచావు' అని మోదీ పోస్ట్ చేశారు.అలానే ఇతర విభాగాల్లో మెడల్స్ సాధించిన యామిని మౌర్య, తేజశ్విన్ శంకర్‌కు ప్రధాని మోదీ విషెష్ తెలిపారు. 'జూడో 57 కేజీల విభాగంలో రజతం నెగ్గిన యామిని మౌర్య, డెకథ్లాన్ ఈవెంట్‌లో కాంస్యం సాధించిన శంకర్‌కు శుభాకాంక్షలు. జూడో పట్ల యామిని అభిరుచి అభినందనీయం. ఎక్కువ మంది యువత జూడో వైపు వచ్చేందుకు మౌర్య విజయం బాటలు వేస్తుంది. ఇక పది ఈవెంట్లలో ఆల్ రౌండర్ ప్రదర్శన చేసిన తేజశ్విన్ కష్టానికి ప్రతిఫలం దక్కింది. భవిష్యత్తులోనూ ఇలానే కొనసాగాలని ఆశిస్తున్నాను' అని ప్రధాని మోదీ తెలిపారు.

# భవిష్యత్తులో వైభవ్ సూర్యవంశీ కెప్టెన్ అవుతాడేమో: ఈస్ట్ జోన్ సెలెక్టర్





దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ జట్టుకు భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంపై వస్తోన్న విమర్శలకు ఆ జట్టు సెలెక్టర్ ప్రవంజన్ మల్లిక్ సమాధానమిచ్చారు. జట్టు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. వైభవ్ భవిష్యత్తులో కెప్టెన్ కూడా అవుతాడని అభిప్రాయపడ్డారు. స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఈస్ట్ జోన్ జట్టుకు వైభవ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. అయితే 15 ఏళ్ల వయసులోనే ఇంత పెద్ద బాధ్యత ఇవ్వడం సరైన నిర్ణయం కాదంటూ సోషల్ మీడియాలో పలువురు మాజీ క్రికెటర్లు, అభిమానులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.'వైభవ్‌ను కెప్టెన్‌గా నియమించలేదు. వైస్ కెప్టెన్ మాత్రమే. కెప్టెన్ ఇషాన్ కిషన్ వికెట్ కీపర్ కావడంతో రోజంతా మైదానంలో చురుకుగా ఉంటాడు. వైభవ్ మొత్తం మ్యాచ్‌కు నాయకత్వం వహించాల్సిన పరిస్థితి ఉండదు. చిన్న వయసులోనే బాధ్యతలు ఇవ్వడం అతడిని మరింత పరిణతి చెందిన ఆటగాడిగా తీర్చిదిద్దుతుంది. దేశం కోసం బాగా ఆడాలనే తపన వైభవ్‌లో ఉంది. యువ ఆటగాళ్లకు బాధ్యతలు అప్పగించడం చాలా ముఖ్యం. అందుకే ఈ అవకాశాన్ని కల్పించాం. వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో కెప్టెన్ అవుతాడేమో! అతడి ప్రతిభ అసాధారణం. వైభవ్ ఇప్పటికే బిహార్ ఫస్ట్‌క్లాస్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఉంది. వాటిని మేము గౌరవిస్తాం. అయితే జట్టుకు ఏది మంచిదో అదే చేశాం. ఇది సెలక్షన్ కమిటీ సభ్యులందరూ కలిసి తీసుకున్న నిర్ణయం' అని ప్రవంజన్ స్పష్టం చేశారు.కాగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈస్ట్ జోన్ సెలక్షన్ కమిటీ సమావేశంలో ప్రవంజన్ మల్లిక్‌తో పాటు దిబ్యేందు చక్రవర్తి, మనీష్ వర్ధన్, అలోక్ సాహా, అనంత్ ప్రకాశ్ పాల్గొన్నారు. అయితే ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఈ దులీప్ ట్రోఫీ జరగనుంది. కాగా ఈస్ట్ జోన్ జట్టు తన తొలి మ్యాచ్‌ను నార్త్ జోన్‌తో ఆడనుంది.

# ఇంగ్లండ్ గడ్డపై అదరగొడుతున్న ఢిల్లీ ఆల్ రౌండర్

లండన్: ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆల్ రౌండర్ అశుతోష్ శర్మ ఇంగ్లండ్ గడ్డపై అదరగొడుతున్నాడు. అక్కడి వన్డే కప్‌లో హ్యాంప్‌షైర్‌కు అశుతోష్ 4 మ్యాచుల్లో 13 వికెట్ల పడగొట్టాడు. ఇంగ్లండ్‌లోని వైవిధ్యభరితమైన పిచ్‌లపై తన మీడియం పేస్ బౌలింగ్‌తో బ్యాటర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. తాజాగా ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 5 వికెట్ల ప్రదర్శనతో సత్తా చాటాడు. దీనికి ముందు మ్యాచ్‌లో ఓ వికెట్ తీసిన అశుతోష్ అంతకు ముందు మ్యాచ్‌లో 4 వికెట్లు, దానికి ముందు మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శనలతో ఆశుతోష్ ఈ సీజన్‌లో హ్యాంప్‌షైర్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే బ్యాటింగ్‌లో మాత్రం తేలిపోతున్నాడు. 4 మ్యాచ్‌ల్లో కేవలం 37 పరుగులు మాత్రమే చేశాడు. భారీ హిట్టింగ్ చేసే సామర్థ్యం ఉన్నప్పటికీ.. ఒకటి రెండు మెరుపులతో సరిపెట్టాడు. ఈ టోర్నీలో అశుతోష్ స్కోర్లు వరుసగా 10, 0, 11, 16 పరుగులుగా ఉన్నాయి.





# భారత్ ఖాతాలో మరో రెండు పసిడి పతకాలు



గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ ఖాతాలో మరో రెండు స్వర్ణాలు చేరాయి. ఇవాళ బాక్సింగ్ విభాగంలో భారత్ ఈ రెండు పసిడి పతకాలను సాధించింది. తొలుత మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ గోల్డ్ మెడల్ గెలిచింది. తుదిపోరులో కెనడాకు చెందిన స్కార్లెట్ సవన్నా డెల్గాడోను ప్రీతి చిత్తుగా ఓడించింది. అనంతరం మహిళల 57 కేజీల విభాగంలో జైస్మిన్ లాంబోరియా భారత్ కు పసిడిని అందించింది. ఫైనల్ లో నార్తర్న్ ఐర్లాండ్ కు చెందిన మైఖేలా వాల్ష్ పై జైస్మిన్ విజయం సాధించింది.

# కామన్వెల్త్ గేమ్స్: ఆ జ్ఞాపకాలు మళ్లీ గుర్తొచ్చాయి.. నీరజ్ చోప్రా భావోద్వేగం




కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా రజత పతకం కైవసం చేసుకోవడంపై స్పందించాడు. తనతో పాటు భారత అథ్లెట్ యశ్వీర్ సింగ్ కూడా పోడియంపై నిలవడం తనకెంతో ఆనందంగా అనిపించిందని తెలిపాడు. ఈ విజయం తనకు ఆసియా క్రీడలను గుర్తు చేసిందని తెలిపాడు. కాగా ఈ టోర్నీలో నీరజ్ చోప్రా రజతం సాధించగా.. యశ్వీర్ సింగ్ అద్భుత ప్రదర్శనతో కాంస్యం నెగ్గిన సంగతి తెలిసిందే.'ఆసియా క్రీడల్లో నేను, సౌరవ్ ఇద్దరం పతకాలు గెలిచాం. ఇప్పుడు ఆ సందర్భం మళ్లీ గుర్తొచ్చింది. యశ్వీర్ అత్యంత కీలక సమయంలో వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేయడం గొప్ప విషయం. ఇద్దరం కలిసి పోడియంపై నిలవడం ఆనందంగా ఉంది. జాతీయ గీతం వినిపించే ప్రతి క్షణం ప్రత్యేకమే. గాయం నుంచి కోలుకుని సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగా. నా పునరాగమనం సరైన దిశలోనే సాగుతోంది. ఇంకా చాలా పోటీలు ఉన్నాయి. నా ప్రదర్శనను మెరుగుపరుచుకుంటా. ఇప్పటి వరకు నా ఆటపై సంతృప్తిగా ఉన్నా' అని నీరజ్ పేర్కొన్నాడు.తొలి అంతర్జాతీయ పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని యశ్వీర్ వెల్లడించాడు. 'పోటీ ఆరంభంలో అనుకున్నంత సులువుగా సాగలేదు. ఒక దశలో నా త్రో 81.3 మీటర్ల వద్దే ఉంది. కాంస్య పతకానికి 82 మీటర్లు సరిపోతాయని చూసిన తర్వాత నాకు నమ్మకం వచ్చింది. చివరి ప్రయత్నంలో పూర్తి స్థాయిలో విసరాలని నిర్ణయించుకున్నా. అదే నాకు పతకాన్ని అందించింది. కుటుంబ సభ్యులు, కోచ్‌లు, నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఈ విజయం అంకితం' అని యశ్వీర్ తెలిపాడు.

# పాకిస్థాన్ క్రికెటర్‌ను హత్తుకున్న జెమీమా రోడ్రిగ్స్..




భారత మహిళా స్టార్ క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్.. పాకిస్థాన్ క్రికెటర్ ఫాతిమా సనాను హత్తుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ది హండ్రెడ్ లీగ్ టోర్నీలో భాగంగా సదర్న్ బ్రేవ్, బర్మింగ్‌హామ్ ఫినిక్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరు జట్ల ప్లేయర్లు పరస్పరం అభినందించుకుంటుండగా, జెమీమా– ఫాతిమా ఒకరినొకరు పలకరించుకుని ఆలింగనం చేసుకున్నారు.2025లో పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. ఆసియా గేమ్స్ నాటి నుంచి ఇరు జట్ల ప్లేయర్లు షేక్‌హ్యాండ్ కూడా ఇచ్చుకోవడం మానేశారు. ఈ క్రమంలో ఫాతిమా సనాను జెమీమా హగ్ చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ముందుగా బ్యాటింగ్ చేసిన సదర్న్ బ్రేవ్.. 100 బంతుల్లో 3 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. లిజెల్ లీ (43), మాయా బూషియర్ (45) రాణించగా, జెమీమా రోడ్రిగ్స్ 18 బంతుల్లో 28 పరుగులతో అజేయంగా నిలిచింది. బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ తరపున ఫాతిమా సనా మూడు సెట్ల (15 బంతులు) బౌలింగ్‌లో 33 పరుగులు ఇచ్చింది. 141 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బర్మింగ్‌హామ్ ఫీనిక్స్‌కు టామీ బీమాంట్ (22), డవీనా పెరిన్ (52) శుభారంభం అందించినా, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. నిర్ణీత 100 బంతుల్లో 5 వికెట్లకు 116 పరుగులకే పరిమితమైంది. దీంతో సదర్న్ బ్రేవ్ 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ సీజన్‌లో వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేయగా, బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ ఇంకా గెలుపు ఖాతా తెరవలేదు.

# ప్రైవేటు పెట్టుబడి ప్లాన్‌ను రద్దు చేసిన ఫిఫా

న్యూయార్క్: ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ అసోసియేషన్(కీలక నిర్ణయం తీసుకున్నది. ఫిఫాలో వాటాలను ప్రైవేటు పెట్టుబడిదారులకు అమ్మాలన్న నిర్ణయాన్ని రద్దు చేసినట్లు అధ్యక్షుడు గియాన్ని ఇన్‌ఫాంటినో తెలిపారు.



సుమారు 20 శాతం వాటాలను అమ్మి దాదాపు 402 కోట్ల డాలర్లను ఆర్జించాలని ఫిఫా భావించింది. కానీ ప్రణాళికకు ఫుట్‌బాల్ సమాఖ్యల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఫిఫాలోని సభ్య దేశాలు ప్రైవేటు పెట్టుబడులను వ్యతిరేకించాయి. ప్రపంచకప్‌తో పాటు పలు రకాల ఈవెంట్లను ఫిఫా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వ్యతిరేకత ఎక్కువ కావడం వల్ల వివాదాస్పద ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్లు గియాన్ని ఇన్ఫాంటినో తెలిపారు.తాము అనుకున్న ప్రాజెక్టుపై భిన్నాభిప్రాయలు వచ్చాయని, దీంతో విభజన ఏర్పడిందని, తమ లక్ష్యాలు నెరవేరడం లేదు కాబట్టి, ఆ పెట్టుబడి ప్లాన్‌ను రద్దు చేసినట్లు ఫిఫా అధ్యక్షుడు చెప్పారు. ఫిఫాలో మొత్తం 211 సభ్య దేశాలు ఉన్నాయి. అయితే ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌కు ఓకే చెబితే ఆయా దేశాలకు 40 మిలియన్ల డాలర్లు ఇస్తామని ఇన్‌ఫాంటినో ఆఫర్ చేశారు. మహిళల, పురుషుల ప్రపంచకపల్లో ప్రైవేటు ఇన్వెస్టర్లకు అవకాశం కల్పించేందుకు ప్లాన్ చేశారు. కానీ యురోపియన్ ఫుట్‌బాల్ సంఘం యూఈఎఫ్‌ఏ ఆ ప్లాన్‌ను వ్యతిరేకించింది. ఒకవేళ ఆ ప్రణాళిక అమలు చేస్తే తాము వరల్డ్‌కప్‌ను నిషేధిస్తామని అన్నారు.




# సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం

తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్‌గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.





# రెండు భాగాలుగా అల్లు,అట్లీల రాకా మూవీ



టాలీవుడ్ ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.



# పెళ్లిచూపులు మూవీకి పదేళ్లు





తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకున్న 'పెళ్లిచూపులు' విడుదలై జులై 29 పదేళ్లు పూర్తి చేసుకుంది. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ జంటగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 2016లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడమే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ పరిచయమైన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత డి. సురేశ్ బాబు సమర్పణలో రాజ్ కందుకూరి, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మించారు. సహజమైన కథనం, వినోదభరితమైన సంభాషణలు, కొత్త తరహా స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పలువురు ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు తెచ్చిపెట్టింది. 'పెళ్లిచూపులు' విజయ్ దేవరకొండ కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. సోలో హీరోగా ఆయనకు ఇది తొలి పెద్ద విజయం. సినిమాలో విజయ్ నటన,

సహజమైన డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విజయంతో వరుస అవకాశాలు అందుకున్న విజయ్, ఆ తర్వాత 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' వంటి విజయాలతో స్టార్ హీరోగా ఎదిగారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రీతూ వర్మ తన సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకుని ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందింది. ఇక దర్శకుడు తరుణ్ భాస్కర్ తొలి సినిమాతోనే తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్నారు. 'పెళ్లిచూపులు' తర్వాత టాలీవుడ్‌లో క్రేజీ దర్శకుడిగా ఎదిగిన ఆయన, అనంతరం నటుడిగానూ తనదైన గుర్తింపు సంపాదించారు.బాక్సాఫీస్ దగ్గర మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పెళ్లిచూపులు' అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను కూడా సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు లభించాయి. ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా 'పెళ్లిచూపులు' జాతీయ పురస్కారం అందుకోగా, ఉత్తమ మాటల రచయితగా దర్శకుడు తరుణ్ భాస్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. అలాగే 2016 సంవత్సరానికి గాను ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి విభాగాల్లో రెండు నంది అవార్డులు కూడా ప్రకటించబడ్డాయి. ఇందులో రీతూ వర్మ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయ్యారు. అయితే ఆ సమయంలో నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర సినీ పురస్కారాల్లో కూడా 'పెళ్లిచూపులు'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ చిత్రాన్ని సెకండ్ బెస్ట్ మూవీగా ఎంపిక చేసి చిత్రబృందాన్ని సత్కరించింది. దీంతో విడుదలై పదేళ్లు పూర్తయినా 'పెళ్లిచూపులు' ప్రస్థానం ఇంకా కొనసాగుతూనే ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# 8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్




యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం ఆగస్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒకేసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**